GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం- ఫిబ్రవరి 01- 2024 పేజీలు : 3

## నేడు కెసిఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం

**టీ మీడియా, జనవరి 31,హైదరాబాద్ :** బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గురువారం మధ్యాహ్నం శాసనసభకు వెళ్లనున్నారు.. ముందుగా ఆయన ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో పూజలు చేయనున్నారు. అనంతరం సభాపతి గడ్డం ప్రసాద్ సమక్షంలో కేసీఆర్ గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావలసిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ కెసిఆర్ ఆహ్వానించారు. కాగా, తుంటికి ఆపరేషన్ కావడంతో డాక్టర్ల సూచన మేరకు కేసీఆర్ గత కొంతకాలంగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల కర్ర సాయంతో నడవగలుగుతున్నారు.



# రామ మందిరం, మేక్ ఇన్ ఇండియా

- స్వయం సమృద్ధి భారత్ పదేళ్ళ అభివృద్ధి
- ప్రశంసించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

**టీ మీడియా, జనవరి 31,న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ రెండవ పర్యాయం చివరి బడ్జెట్ సెషన్ జనవరి 31న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమైంది. ప్రెసిడెంట్ ముర్ము కొత్త పార్లమెంట్‌లో తొలిసారిగా ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్వయం సమృద్ధి భారత్' మన శక్తిగా మారాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అయోధ్యలోరామమందిరాన్ని ప్రతిష్టించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. లోక్‌సభ స్పీకర్, పార్లమెంట్ సెక్రటరీ రాజదండంతో లోక్‌సభలోకి ప్రవేశించారు. అటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజదర్పాన్ని ప్రదర్శిస్తూ గుర్రపుబండిలో పార్లమెంట్ భవనానికి విచ్చేశారు. రాజదండంతో రాష్ట్రపతికి లోక్‌సభ స్పీకర్, ఉపరాష్ట్రపతి ధన్కర్, ప్రధాని మోదీ స్వాగతం పలికారు. రాష్ట్రపతి ముర్ము పార్లమెంట్ ఉభయసభలను



ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సమావేశాలు ఫిబ్రవరి 9వ తేదీ వరకూ కొనసాగుతాయి.ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మోదీ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ప్రస్తుతం మనం చూస్తున్న విజయాలు గత 10 సంవత్సరాలుగా అనుసరిస్తున్న పద్ధతులకు పొడిగింపు అని అన్నారు. 'గరీబీ హఠావో' అనే నినాదాన్ని చిన్నప్పటి నుంచి వింటూనే ఉన్నాం. ఈరోజు మన జీవితంలో మొదటిసారిగా పేదరికాన్ని పెద్ద ఎత్తున నిర్మూలించడం చూస్తున్నామన్నారు రాష్ట్రపతి.గతంలో ప్రపంచం రెండు పెద్ద యుద్ధాలను చూసిందని, కరోనా వంటి మహమ్మారిని ఎదుర్కొందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. అటువంటి ప్రపంచ సంక్షోభాలు ఉన్నప్పటికీ, మన ప్రభుత్వం దేశంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచిందని గుర్తు చేశారు. సామాన్య భారతీయులపై భారం మోపకుండా కేంద్ర తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు.యువశక్తి, మహిళా శక్తి, రైతులు, పేదలు అనే నాలుగు బలమైన స్తంభాలపై అభివృద్ధి చెందిన భారతదేశం గొప్ప భవనం నిలుస్తుందని, భారత ప్రభుత్వం విశ్వసిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్వావలంబన భారత్' మన శక్తిగా మారాయని ముర్ము అన్నారు. రక్షణ రంగ ఉత్పత్తి రూ.లక్ష కోట్ల మార్కును దాటిందని రాష్ట్రపతి ప్రశంసించారు.గత ఏడాది భారత్‌కు విజయాలతో నిండిపోయిందన్నారు. అనేక విజయాలు ఉన్నాయని గుర్తు చేసిన ముర్ము.. భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. చంద్రుడి దక్షిణ ధృవాన్ని చేరుకున్న తొలి దేశంగా భారత్ అవతరించిందని తెలిపారు. భారతదేశం నిర్వహించిన విజయవంతమైన 20 సమ్మిట్ భారతదేశం పాత్రను బలోపేతం చేసింది. ఆసియా క్రీడల్లో భారత్ 100కు పైగా పతకాలు సాధించింది. భారతదేశానికి కూడా అటల్ టన్నెల్ వచ్చింది.

అలాగే కొత్త పార్లమెంటు భవనంలో ఇది నా మొదటి ప్రసంగం. ఈ గొప్ప భవనం అమృత కాలం ప్రారంభంలో నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఇది 'వన్ ఇండియా, బెస్ట్ ఇండియా' అనే సువాసనను కలిగి ఉందన్న రాష్ట్రపతి, ప్రజాస్వామ్య, పార్లమెంటరీ సంప్రదాయాలను గౌరవించాలనే సంకల్పం ఉందన్నారు. ఇది కాకుండా, 21వ శతాబ్దపు కొత్త భారతదేశానికి సంబంధించిన కొత్త సంప్రదాయాలను నిర్మించాలనే సంకల్పం ఉందన్నారు. ఈ కొత్త భవనంలో విధానాలపై అర్థవంతమైన చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.మన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వాతంత్ర్య వేడుకలను అమృత మహోత్సవ్ జరుపుకున్నామని, దేశం కోసం అలుపెరుగని పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందని తెలిపారు. ఈ కొత్త భవనంలో విధానాలపై అర్థవంతమైన చర్చలు జరుగుతాయని, అంతా సానుకూలంగా ఉంటుందని రాష్ట్రపతి అన్నారు.






## రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా..

# 15వేల పోలీస్ ఉద్యోగాలు

- టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలో ఉద్యోగాల భర్తీ
- స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

అందచేసిన సి ఎం

**టీ మీడియా, జనవరి 31,హైదరాబాద్ :** టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలో ఉద్యోగాల భర్తీ చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అలాగే పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా త్వరలో 15వేల పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన 7,094 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందజేశారు..అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉండేవని అన్నారు. ఆ సమస్యను త్వరగా పరిష్కరించగలిగామని ఆయన తెలిపారు. వైద్యఆరోగ్య శాఖ మంత్రి పరిస్థితిపై సమీక్షించి నియామకాలు త్వరగా జరిగేలా చూశామన్నారు. ఉద్యోగ నియామకం వేళ మీ సంతోషంలో భాగస్వాములం అయినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.విద్యార్థుల త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని సీఎం అన్నారు. గడిచిన పదేళ్లలో తెలంగాణ యువత ఆకాంక్షలు నెరవేరలేదన్నారు. గత ప్రభుత్వం వాళ్ల కుటుంబ సభ్యుల గురించి మాత్రమే ఆలోచించిందన్నారు. నిరుద్యోగుల సమస్య గురించి ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. తెలంగాణ కోసం పోరాడిన యువతపై గత ప్రభుత్వం కేసులు పెట్టి వేధించిందన్నారు

## హ్యాట్రిక్..గ్యారెంటీ ! మళ్లీ అధికారం మాదే

### -మీడియాతో ప్రధాని మోదీ



**టీ మీడియా, జనవరి 31,ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం చివరి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. నూతన పార్లమెంట్ భవనంలో మొదటి సమావేశంలో ఈసారి ఆర్థిక మంత్రి దిశా నిర్దేశక్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారని ప్రధాని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంతో దేశం దినదినాభివృద్ధి చెందుతూ కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ధృఢంగా విశ్వసిస్తున్నట్లు మోదీ తెలిపారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో గెలిచిన తరువాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశడతామని అన్నారు. ఈ సందర్భంగా మోదీ మూడోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని తన మాటల్లో ధీమాను వ్యక్తం చేశారు. చివరి పార్లమెంట్ సమావేశాల సందర్భంగా గడిచిన పదేళ్లలో తాము ఎలా వ్యవహరించారో పునరాలోచించుకోవాలి. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎంపీలు తమ ఉత్తమ ప్రతిబకనబర్చాలని మోదీ సూచించారు. మా ప్రభుత్వానికి జనాదరణ ఉంది.. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పూర్తిస్థాయి బడ్జెట్ వస్తుంది.. దేశం వృద్ధిలో ముందుకు వెళ్తుందని మోదీ అన్నారు.ఆ వైఖరి మార్చుకోవాలి.. పశ్చాత్తాపపడండి..

ప్రజాస్వామ్యనికి వ్యతిరేకంగా, అనైతికంగా వ్యవహరించిన వారు ఇప్పటికైనా పశ్చాత్తాపడండి, వారి వైఖరి మార్చుకోవాలంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలను అడ్డుకునేవారిని ప్రజలు క్షమించరని అన్నారు.శాంతి పరిరక్షణలో నారీశక్తి కీలకంగా మారింది. నారీశక్తిని కేంద్రం ప్రతిభింబిస్తుంది. కొత్తపార్లమెంట్ భవనంలో నిర్వహించిన తొలి సమావేశాల్లో నారీశక్తి వందన్ అధినియమ్ పేరుతో మహిళా రిజర్వేషన్లకు ఆమోదం తెలిపాం. జనవరి 26న కర్తవ్య పథ్ లో నారీశక్తి ఇనుమడించింది. ఈ రోజు బడ్జెట్ సమావేశాలు కూడా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మార్గదరక్శకత్వంలో మొదలు కానున్నాయి. రేపు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు. మన నారీ శక్తికి ప్రతీక ఇదే అని మోదీ అన్నారు. చివరి సమావేశాలు సజావుగా జరిగేలా సభ్యులు సహకరించాలని మోదీ ప్రతిపక్ష పార్టీల ఎంపీలకు సూచించారు.



## మా కాలనీ నుండి వెళ్లిపోండి

### -సీనియర్ కాంగ్రెస్ నేతకు నోటీసులు



**టీ మీడియా, జనవరి 31,న్యూఢిల్లీ :** అయోధ్య రామమందిర వేడుకను ఖండిస్తూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసినందకు నివాసాన్ని ఖాళీ చేయాల్సిందిగా కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్‌కు నోటీసులు అందాయి. ఢిల్లీలోని జంగ్‌పురాలోని నివాసాన్ని ఖాళీ చేయాల్సిందిగా మణిశంకర్, ఆయన కుమార్తె సూర్య అయ్యర్‌లకు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యుఎ) నోటీసులు పంపింది. గతంలో జరిగిన ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఇతర నివాసితుల మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా, శాంతికి భంగం కలిగించేలా పోస్టులు చేయవద్దని ఆ నోటీసుల్లో కోరింది. "మీ పోస్టు సరైనదని మీరు భావిస్తే.. అటువంటి విద్వేషాన్ని ఆమోదిస్తూ కళ్లు మూసుకునే మరో కాలనీకి దయచేసి వెళ్లిపోవాలని మేము సూచిస్తున్నాము " అని పేర్కొంది. విద్యావంతురాలైన సూర్య అయ్యర్‌కి ఇది తగదని, 500 ఏళ్ల తర్వాత రామమందిరాన్ని నిర్మిస్తున్నారని, అది కూడా సుప్రీంకోర్టు 5-0 మెజారిటీతో తీర్పు ఇచ్చిన తర్వాతేనన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎ పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పుని గౌరవించాలని, రాజ్యాంగం కల్పించిన వాక్‌స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం తగదని పేర్కొంది.మీరు దేశ శ్రేయస్సు కోసం రాజకీయాల్లో ఏమైనా చేయవచ్చు. కానీ మీ చర్యలు కాలనీకి మంచి లేదా చెడ్డపేరు తీసుకువస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇకపై ఇటువంటి పోస్టులు / కామెంట్లు చేయడం మానుకోవాలని " అని పేర్కొంది. మణిశంకర్ అయ్యర్ తన కుమార్తె పోస్టును ఖండించాలని లేదా ఇల్లు వదిలి వెళ్లాలని ఆ నోటీసుల్లో ఆదేశించారు. ప్రజలను రెచ్చగొట్టి వారి మధ్య ద్వేషాన్ని, అపనమ్మకాన్ని సృష్టించవద్దని అసిసోయేషన్ హెచ్చరించింది.రామమందిర ప్రాణ ప్రతిష్ట వేడుకకు నిరసనగా తాను నిరాహార దీక్ష చేస్తున్నట్లు జనవరి 20న ఫేస్‌బుక్ పోస్ట్‌లో సూర్య అయ్యర్ పేర్కొన్నారు. ఈ దీక్ష తోటి ముస్లింలకు ప్రేమ, బాధను వ్యక్తం చేస్తుందని పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీ కారుపై దుండగుల దాడి.




**టీ మీడియా, జనవరి 31,పశ్చిమ్ బెంగాల్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడ్ న్యాయ్ యాత్ర బిహార్ రాష్ట్రం నుంచి ఇటీవలే పశ్చిమ్ బెంగాల్‌లోకి ప్రవేశించింది. షెడ్యూల్‌లో ప్రకారం మధ్యాహ్నం మాల్దాకు చేరుకున్న యాత్రలో భద్రతా లోపం కొట్టొచ్చినట్లుగా అయితే, ర్యాలీ సందర్భంగా కొందరు దుండగులు రాహుల్ గాంధీ కారుపై దాడికి తెగబడి అద్దాలు పూర్తిగా ధ్వంసం చేశారు. కారు మీదకు ఎక్కి నినాదాలు చేసే యత్నం చేశారు. ఈ క్రమంలో కారు విండ్‌షీల్డ్ పగిలిపోయింది. దీంతో రాహుల్ భద్రతా సిబ్బంది వారిని వారించి కిందకు దించగా.. పగిలిన కారు అద్దాలతోనే ఆయన ర్యాలీని ముందుకు సాగించారు.



## బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా ఇవ్వం

### - బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

**టీ మీడియా, జనవరి 31, పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో విపక్ష ఇండియా కూటమి ఇబ్బందులు ఇప్పట్లో సమసిపోయేలా లేవు. తమ పార్టీతో పొత్తు పెట్టుకోవాలంటే సీపీఎంతో కాంగ్రెస్ తెగదెంపులు చేసుకోవాలని టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ హస్తం పార్టీకి షరతు విధించారు. సీట్ల సర్దుబాటు చర్చల సందర్భంగా తాను కాంగ్రెస్‌కు రెండు సీట్లు ఇవ్వచూపితే తిరస్కరించారని, ఇక ఇప్పుడు తాను ఒక్క సీటు కూడా ఇచ్చేది లేదని దీదీ స్పష్టం చేశారు. గతంలో సీపీఎం తనపై పలుమార్లు భౌతిక దాడులు చేసిందని, తనను నిర్ధాక్షిణ్యంగా కొట్టారని, శ్రేయోభిలాషుల ఆశీస్సులతోనే తాను బతికి బయటపడ్డానని దీదీ గుర్తుచేశారు. లెఫ్ట్‌ను తాను ఎన్నడూ మన్నించనని, సీపీఎంను అసలు విడిచిపెట్టేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు సీపీఎంతో జట్టు కట్టినవారిని తాను మరువనని అన్నారు. మమతా బెనర్జీ బుధవారం మాల్దాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్‌కు రెండు లోక్‌సభ స్థానాలు ఇచ్చి వారిని గెలిపించుకుంటానంటే వారు ఎక్కువ స్థానాలను కోరుకున్నారని, మీరు లెఫ్ట్‌తో జట్టుకడితే తాను వారికి ఒక్క సీటు కూడా ఇవ్వనని చెప్పానని దీదీ తేల్చిచెప్పారు. ఇక బెంగాల్‌లో సీపీఎంతో పొత్తు ఉండబోదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గతంలో వెల్లడించారు. బీజేపీ, టీఎంసీతో పోరాడేందుకు లెఫ్ట్, కాంగ్రెస్‌తో పాటు లౌకిక పార్టీలు కలిసివస్తాయని ఆయన పలుమార్లు పేర్కొన్నారు.

# ఒకే ఒక్కడు ఎవరు?

### -బీఆర్ఎస్? నుంచి రాజ్యసభకు వెళ్లేది ..?

**టీ మీడియా, జనవరి 31,హైదరాబాద్ :** రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గులాబీ పార్టీలో సందడి మొదలైంది. ఈసారి పెద్దల సభకు వెళ్లేదెవరు? అన్నది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో మూడు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. ఆ మూడు చోట్ల బీఆర్ఎస్ నేతలే ఎంపీలుగా ఉన్నారు. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన క్రమంలో ఎమ్మెల్యేల బలాన్ని బట్టి గులాబీ పార్టీకి ఒకే ఒక్క రాజ్యసభ స్థానం దక్కే అవకాశం ఉంది.రాజ్యసభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, రవిచంద్ర పదవీ కాలం ఏప్రిల్ తో ముగియనుంది. ఈ స్థానాలను భర్తీ చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 27న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి.

#### గులాబీ పార్టీలో ఆ ఒక్కరు ఎవరు?

2018లో జరిగిన ఎన్నికల్లో సంపూర్ణ మెజార్టీ దక్కించుకున్న బీఆర్ఎస్.. మూడు రాజ్యసభ స్థానాలను ఏకగ్రీవంగా దక్కించుకుంది. తాజాగా ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా మారడంతో రాజ్యసభ స్థానాలు కూడా కోల్పోవాల్సి వస్తోంది. శాసనసభ్యుల సంఖ్యా బలాన్ని పరిగణలోకి తీసుకుంటే.. రెండు స్థానాలు కాంగ్రెస్ పార్టీకి, ఒక స్థానం బీఆర్ఎస్ కు దక్కే అవకాశాలు ఉన్నాయి. అయితే, గులాబీ పార్టీలో ఆ ఒక్కరు ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

#### రవిచంద్రకు మరో ఛాన్స్?

పదవీ కాలం ముగుస్తున్న ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో సంతోష్ కుమార్, లింగయ్య యాదవ్ తమ ఆరేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఇక, అంతకుముందు రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండ ప్రకాశ్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో రాజ్యసభకు రాజీనామా చేశారు. మిగిలిన రెండేళ్ల కాలానికి వద్దిరాజు రవిచంద్రకు ఉపఎన్నికలో రాజ్యసభ సభ్యుడిగా అవకాశం దక్కింది. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వద్దిరాజు రవిచంద్రకు మరోసారి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది.

#### రేసులో సీనియర్ నేతలు..

బలమైన సామాజిక వర్గం కావడం, పార్లమెంట్ ఎన్నికలకు ముందు రాజ్యసభ ఎన్నికలు వస్తుండటంతో బలహీన వర్గాల్లో బలమైన సామాజిక నేపథ్యం ఉన్న వద్దిరాజు వైపు పార్టీ మొగ్గుచూపుతోందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ రవిచంద్రను లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయించాలని పార్టీ భావిస్తే ప్రత్యామ్నాయంగా సీనియర్ నేతలైన పొన్నాల లక్ష్మయ్య పేరు కూడా పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

#### కాసానికి ఛాన్స్ దక్కుతుందా?

ఒకవేళ జాతీయ రాజకీయాలను దృష్టిలో ఉంచుకుంటే సీనియర్ నేతలు రావుల చంద్రశేఖర్ రెడ్డి లేదా నాగం జనార్దన్ రెడ్డి పేర్లు తెరపైకి వచ్చే ఛాన్స్ ఉందన్న చర్చ కూడా పార్టీలో జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కీలక సామాజికవర్గంగా ఉన్న ముదిరాజ్ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్న ఆరోపణలను బీఆర్ఎస్ ఎదుర్కొంది. ఈ కారణంగా ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ కు ఛాన్స్ దక్కవచ్చన్న ప్రచారం కూడా ఉంది. మొత్తంగా వీరందరిలో ఎవరివైపు గులాబీ అధిష్టానం మొగ్గ చూపిస్తుంది అనేది వేచి చూడాలి.




## వేములవాడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు

**- సీఎం రేవంత్ రెడ్డి**

**టీ మీడియా, జనవరి 31, హైదరాబాద్:** వేములవాడ టెంపుల్‌కు హెచ్ఎండీఏ నుంచి రావాల్సిన రూ.20 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని హెచ్ఎండీఏ అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అలాగే వేములవాడ లో బ్రిడ్జి నిర్మానానికి 30 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు. వేములవాడ చెరువు సుందరీకరణకు ప్రత్యేక నిధులు ఇస్తామని హామీనిచ్చారు. త్వరలో మరో సమావేశం నిర్వహిస్తామన్న ఆయన తెలిపారు. కాగా, వేములవాడ టెంపుల్ డెవలప్ మెంట్ అథారిటీతో డా.బీఆర్ అంబేద్కర్ నూతన సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

## మెక్సికోలో ఘోర రోడ్డు ప్రమాదం..

**- 19 మంది మృతి**



**టీ మీడియా, జనవరి 31, మెక్సికో:** మెక్సికోలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందారు. 22 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై అక్కడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీచ్ ఫ్రంట్ నగరాలైన మజట్లాన్న, లాస్ మోచిస్ కోస్టల్ హైవే ప్రయాణికులతో వెళ్తున్న బస్సును వెనక నుంచి వచ్చి ఓ పెద్ద ట్రక్కు అతివేగంతో ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సులో ఉన్న ప్రయాణికుల్లో 19 మంది అక్కడిక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందుకున్న అత్యవసర సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి 22 మందిని కాపాడారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జమ్ముకాశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో ఏకకాలంలో ఈడి సోదాలు



**టీ మీడియా, జనవరి 31, న్యూఢిల్లీ :** జమ్ముకాశ్మీర్, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లలో ఏకకాలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి ) సోదాలు జరిపింది. భారత్ పేపర్స్ లిమిటెడ్ (బిపిఎల్) ముడిపడి ఉన్న రూ.200 కోట్ల బ్యాంక్ రుణాల మోసం కేసులో బుధవారం సోదాలు జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) నిబంధనల ప్రకారం.. ఆయా రాష్ట్రాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో సోదాలు చేపడుతోంది. జమ్ము, లుథియానాలో ఉన్న పేపర్ బోర్డ్ ప్యాకేజింగ్ కంపెనీ భారత్ బాక్స్ ఫ్యాక్టరీ ఇండిస్టీస్ లిమిటెడ్ (బిబిఎఫ్ఐఎల్)తో 2006 సెప్టెంబర్‌లో బిపిఎల్ చేరింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)తో పాటు బ్యాంకుల కన్సార్టియంతో ఆ సంస్థ డైరెక్టర్లు సుమారు రూ.200 కోట్ల బ్యాంక్ రుణాలను తీసుకుని మోసానికి పాల్పడినట్లు కేసు నమోదైనట్లు ఆ వర్గాలు తెలిపాయి. జెకె బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్‌ల నుండి రుణాలను తీసుకున్నట్లు వెల్లడించింది.

## పంజాగుట్ట పిఎస్ మొత్తం సిబ్బందిపై వేటు..




**టీ మీడియా, జనవరి 31, హైదరాబాద్ :** హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సైల నుంచి హోంగార్డుల వరకు అందర్నీ బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 85 మందిని బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 85 మంది సిబ్బందిని ఒకేసారి బదిలీ చేయడం ఇదే మొదటిసారి. భోదన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ వ్యవహారంతో పాటు కీలకమైన విషయాలు బయటకు పొక్కడంపై సీపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వివాదాల పోలీస్ స్టేషన్ గా పేరుపడ్డ, మాజీ ప్రభుత్వ పెద్దలకు సమాచారం చేరవేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో పంజాగుట్ట పీఎస్ లోని మొత్తం సిబ్బందిపై బదిలీ వేటు వేసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు కొత్త సిబ్బందిని సీపీ కేటాయించారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల నుంచి పంజాగుట్ట పీఎస్‌కు కొత్త సిబ్బంది నియమించారు. ఇప్పటికే 82 మందికి కొత్తగా పోస్టింగ్‌లు ఇచ్చారు.

## రెజ్లింగ్ క్రీడాకారులకు నకిలీ సర్టిఫికేట్లు

**- ప్రముఖ రెజ్లర్ సాక్షిమాలిక్**




**టీ మీడియా, జనవరి 31, న్యూఢిల్లీ :** సస్పెండ్‌కు గురైన సంజయ్ సింగ్ నిబంధనలకు విరుద్ధంగా జాతీయ చాంపియన్ షిప్‌లు నిర్వహించడంతో పాటు నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు ఒలింపిక్ విజేత, ప్రముఖ రెజ్లర్ సాక్షి మాలిక్ బుధవారం ప్రకటించారు. రెజ్లర్ల ఆందోళనలతో వెనక్కి తగ్గిన కేంద్రం .. కొత్తగా ఎన్నికైన భారత రెజ్లింగ్ ఫెడరేషన్ (డబ్ల్యుఎఫ్ఐ) అధ్యక్షుడిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కేంద్రం నియమించిన అడ్‌హక్ కమిటీ ఫెడరేషన్ కార్యకలాపాలను పర్యవేక్షిస్తోంది. అయితే సస్పెండ్‌కు గురైన సంజయ్ సింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఈ పోటీలు ఎలా నిర్వహిస్తారని, వారు జారీ చేసే నకిలీ సర్టిఫికెట్లు భవిష్యత్తులో క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేస్తాయని హెచ్చరించారు. ఫెడరేషన్ నిధులను ఎలా దుర్వినియోగం చేస్తారని మండిపడ్డారు. ఈ విషయంలో క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. " వాస్తవానికి క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో జైపూర్‌లో జాతీయ రెజ్లింగ్ చాంపియన్ షిప్ జరగనుంది. కానీ తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి సంజయ్ సింగ్ జాతీయ ఛాంపియన్‌షిప్‌లను నిర్వహిస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్‌లని జారీ చేస్తున్నారు" సాక్షి మాలిక్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. " ఈ సర్టిఫికెట్‌లతో క్రీడాకారులకు ఉద్యోగాలు రావు. వారి తప్పు లేకపోయినా కేసులను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారి భవిష్యత్తు నాశనం కాకుండా సంజయ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలి " అని పేర్కొన్నారు.

## అంకిత భావంతో విధులు నిర్వహిస్తే ఉన్నత స్థాయి కి చేరవచ్చు

**- ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి**



**టీ మీడియా, జనవరి 31, మహానంది:** గత 42 సంవత్సరాల పాటు మహానంది దేవస్థానంలో భక్తులకు ఎంతో భక్తిశ్రద్దలతో కొనుగోలు చేసే లడ్డు,వడ, పులిహోర మొదలగు ప్రసాదములను చేసే జుమన్ కుమార్ బుదవారం పదవి విరమణ సందర్భంగా వారికి ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. మహానంది దేవస్థానం ఉద్యోగ సంక్షేమ సంఘం, చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో కుమారయ్య కుటుంబ సభ్యులతో పాటు ముఖ్యఅతిథిగా శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్ప భువనేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మాట్లాడుతూ ఆలయంలో విధులు నిర్వహించే ఉద్యోగి ఏ స్థాయిలో ఉన్న కూడా వారు అంకితభావంతో, సమయపాలనతో పనిచేస్తే ఉద్యోగికి సంతృప్తి మరియు ఉన్నత స్థాయి కి చేరడానికి సులభతరంగా వుంటుంది అన్నారు. అదేవిధంగా హెచ్. జే. కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగ నిర్వహణ అనేది ఎన్నో సవాల్ లతో కూడుకున్న పని అని, ఈ సవాల్ లను ఎదుర్కొంటూ అంకితభావంతో పనిచేస్తే అందరి మన్ననలు పొంది ఉద్యోగానికి న్యాయం చేసిన వాళ్ళము అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏ ఈ ఓ మధు, ధర్మకర్త మండలి సభ్యులు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జేడీ(ఎస్)ను దాదాపుగా బీజేపీలో విలీనం చేశారు

**- కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్**



**టీ మీడియా, జనవరి 31, బెంగళూరు:** కాంగ్రెస్ నేత, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మాజీ సీఎం కుమారస్వామిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. జేడీ(ఎస్)ను ఆయన దాదాపుగా బీజేపీలో విలీనం చేశారని అన్నారు. హనుమాన్ జెండా వివాదంపై మాండ్యాలో బీజేపీ, హిందూ సంఘాలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో కుమారస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాషాయ శాలువా ధరించారు. దీని గురించి మీడియా అడిగిన ప్రశ్నకు డీకే శివకుమార్ స్పందించారు. కుమారస్వామి తన పార్టీని దాదాపుగా బీజేపీలో విలీనం చేసినట్లేనని విమర్శించారు. 'కాషాయ శాలువా లేదా మరేదైనా శాలువా ధరించడాన్ని కుమారస్వామి ఎంచుకోవచ్చు. అది ఆయన పార్టీ అంతర్గత విషయం. మాండ్యాలో రాజకీయ పునాది కోసం బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఎవరు ఎవరిని మింగేస్తారో తెలియడం లేదు' అని అన్నారు. కాగా, మాండ్యాలో హనుమాన్ జెండా వివాదంపై ప్రజలను రెచ్చగొట్టడానికి బీజేపీ, జేడీ(ఎస్) ప్రయత్నిస్తున్నాయని డీకే శివకుమార్ ఆరోపించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలనే ఉద్దేశంతో గ్రామస్తులను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. 'బీజేపీ, జేడీ(ఎస్) మాండ్యాలో ఈ కొత్త ప్రయోగానికి ప్రయత్నిస్తున్నాయి. కానీ, ఇక్కడి ప్రజలు లౌకికవాదులు, సహనశీలులు' అని డీకే శివకుమార్ అన్నారు.

## ఎల్లమ్మ తల్లి గుడి వద్ద ఫ్లాట్ ఫామ్ నిర్మాణానికి కృషి

**- పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్**



**టీ మీడియా, జనవరి 31, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ జూలపల్లి మండలంలోని తెలుకుంట గ్రామ గౌడ సోదరుల కోరిక మేరకు గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లి గుడి వద్ద ప్లాట్ఫామ్ నిర్మాణానికి అక్షరాల నాలుగు లక్షల రూపాయల ప్రభుత్వ, ఎంపీ నిధుల మంజూరికి సహకరించి ఈరోజు గౌడ సోదరులకు ఆ ప్రొసీడింగ్ కాపీని అందజేశారు . ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ మాట్లాడుతూ గతంలో గౌడ కులస్తుల వినతి మేరకు గౌడ సంఘ కమ్యూనిటీ భవనాన్ని నిర్మించడం జరిగిందని, అంతేకాకుండా వారికి ఇచ్చిన హామీ ప్రకారం పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత నాలుగు లక్షల రూపాయల ప్రభుత్వ నిధులను తీసుకురావడం జరిగిందని, గౌడ సంఘ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణంలోనూ తన వంతు కీలక పాత్ర ఉంటుందని, భవిష్యత్తులో ఒక్క గౌడ కులస్తులకే కాకుండా ప్రతి కుల సంఘానికి అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు . అనంతరం గౌడ కులస్తులందరూ రఘువీర్ సింగ్ ని మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు . ఈ కార్యక్రమంలో తెలుకుంట గ్రామ సర్పంచ్ సొల్లు పద్మ-శ్యామ్, గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షుడు అడ్డగుంట ధర్మరాజు, పంజాల లచ్చయ్య, మడ్డి అంజయ్య, బత్తిని లచ్చయ్య, అడ్డగుంట నరసయ్య, కోడూరి నారాయణ, పల్లె సత్తయ్య, మడ్డి శ్రీనివాస్ గౌడ్, కోడూరి అశోక్, అడ్డగుంట శ్రీనివాస్, కోడూరి రామ్, కోడూరి అనిల్ మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిగురు రవీందర్ రెడ్డి, సొల్లు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ని సస్పెండ్ చేయాలి

**- పాఠశాలను ముట్టడించిన విద్యార్థి సంఘాల నాయకులు**



**టీ మీడియా, జనవరి 31, గోదావరిఖని :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్.ఎఫ్.సి.ఎల్ టౌన్ షిప్ లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న జెట్టి వర్షిత్ అనే విద్యార్థినిని అమానుషంగా చితకబాదిన ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని పాఠశాలను బుధవారం ముట్టడించడం జరిగిందని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం,ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ,బిఆర్ఎస్వి నాయకులు ఇరుగురాల శ్రావణ్ లు అన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ..రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్.ఎఫ్.సి.ఎల్ టౌన్ షిప్ లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న జెట్టి వర్షిత్ అనే విద్యార్థి, అతని స్నేహితులతో సంభాషిస్తున్న తరుణంలో అదే పాఠశాలలలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు, తనని చూస్తూ మాట్లాడుతున్నారని అపార్థం చేసుకొని ప్రిన్సిపాల్ కి చెప్పగా, శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ విచారించకుండా, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఉపాధ్యాయురాలు చెప్పిందే విని విద్యార్థినిని అమానుషంగా చితక బాధడం సరైన విధానం కాదని, ఇలాంటి అరాచకాలకు పాల్పడుతున్న ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం విద్యాసంస్థలను ఒక వ్యాపార కేంద్రంగా ఏర్పాటుచేసుకోని, ఫీజులను దండుకోవడం తప్పితే ,విద్యార్థులతో ఏ విధంగా వ్యవహరించాలో కనీస అవగాహన అ ప్రిన్సిపాల్ కి లేదని ఆయన అన్నారు. ఈ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుడా లేక యముడా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. తప్పు చేస్తే విద్యార్థులకు బుద్ధి చెప్పాలే కానీ, పోలీస్ యంత్రాంగం చేసే థర్డ్ డిగ్రీ కంటే అతి దారుణంగా చితక బాధడం సరైన విధానం కాదని ,ఇట్లాంటి స్పృహ కోల్పోయినటువంటి ప్రిన్సిపాల్ ని వెంటనే సస్పెండ్ చేయాలని , శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసు యంత్రాంగం ప్రిన్సిపాల్ పై వెంటనే కేసు నమోదు చేసి ,చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సహాయ కార్యదర్శి మొలుగురి నితీలేష్, రామగుండం కార్పొరేషన్ అధ్యక్షులు మాతంగి సాగర్,బీఆర్ఎస్వి నాయకులు అబ్బాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు శంకర్, అక్షయ్,బట్టు,సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## చండీగఢ్ మేయర్ ఎన్నికపై హైకోర్టు కీలక ఉత్తర్వులు




**టీ మీడియా, జనవరి 31, చండీగఢ్ :** రిటైర్డ్ హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో తాజా ఎన్నికలు జరిపించాలని కోరుతూ ఆప్ దాఖలు చేసిన పిటిషన్‌పై పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోగా తమ స్పందను తెలియజేయాల్సిందిగా చండీగఢ్ పరిపాలన, మునిసిపల్ కార్పోరేషన్‌కు నోటీసులిచ్చింది. చండీగఢ్ మునిసిపల్ కార్పోరేషన్‌లోని 35 మంది సభ్యుల సభలో కాంగ్రెస్, ఆప్ విజయం సాధిస్తుందని అంచనావేసిన సంగతి తెలిసిందే. అయితే జనవరి 30న జరిగిన మేయర్ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ కూటమి కొన్ని స్థానాలకు పరిమితం కాగా, అనూహ్యంగా బిజెపి విజయం సాధించింది. ఈ ఎన్నిక చెల్లదని, తాజా ఎన్నికలు కోరుతూ హైకోర్టును ఆశ్రయిస్తామని ఆప్ పేర్కొంది. మేయర్ అభ్యర్థి, ఆప్ కౌన్సిలర్ కులదీప్ కుమార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తి మోసం, ఫోర్జరీ అని, ఈ ఎన్నిక ప్రక్రియను రద్దు చేయాలని కులదీప్ కుమార్ కోర్టును కోరారు. కొత్తగా ఎన్నికైన మేయర్ విధులను నిర్వర్తించకుండా చండీగఢ్ మునిసిపల్ కార్పోరేషన్ నిరోధించేలా సూచనలివ్వాలని పిటిషన్‌లో కోరారు. ప్రిసైడింగ్ అధికారి అనిల్ మసీహ్ బ్యాలెట్ పత్రాలను ట్యాంపరింగ్ చేశారని ప్రతిపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు.

## పెండింగ్ చలాన్ల రాయితీ గడుపు పెంపు..



**టీ మీడియా, జనవరి 31,హైదరాబాద్:** ట్రాఫిక్ చలానాల రాయితీల విషయంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. మరో 15 రోజుల పాటు పెండింగ్ చలాన్ల చెల్లింపుల గడువు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఇచ్చిన ఈ గడువు జనవరి 31 తో ముగియనుంది. అయితే తాజా ఆదేశాల ప్రకారం ఫిబ్రవరి 15 వరకు వాహనదారులు తమ పెండింగ్ చలాన్లను ఆన్లైన్లో చెల్లించునే వెసులుబాటు కల్పించింది. గతంలో లాగానే ఆర్టీసీ బస్సులకు 90శాతం, ద్విచక్ర వాహనాలు, కార్లకు 80శాతం, భారీ వాహనాలకు 60శాతం రాయితీతో చెల్లించవచ్చు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను పోలీసు శాఖకు, రోడ్డు రవాణా శాఖ ఉన్నతాధికారులకు పంపించారు ముఖ్య కార్యదర్శి శాంతికుమారి. రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్ల 59 లక్షల పెండింగ్ చలానాలు ఉండగా.. ఆఫర్ ప్రకటించినప్పటి నుంచి ఇప్పటివరకు కోటీ ఐదు లక్షల మంది చలాన్లు కట్టినట్టు అధికారులు తెలిపారు. దీని ద్వారా మొత్తం 107 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేకూరినట్టు పేర్కొన్నారు. ఇవి డిసెంబరు 25 వరకు ఉన్న లెక్కలు మాత్రమే. తాజాగా పూర్తి వివరాలు ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. మొదటి రోజు నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున వాహనదారులు చలాన్లు కట్టటంతో.. సర్వర్ హ్యాంగ్ అయ్యింది. దీంతో.. చాలా మంది వాహనదారులు చలాన్లు కట్టలేకపోయారు. దీన్ని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ రాయితీకి ఫిబ్రవరి 15 వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

## ఏపీ క్యాబినేట్ కీలక నిర్ణయాలు..

**- మెగా డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్**



**టీ మీడియా, జనవరి 31, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ కేబినేట్ కీలక అంశాలకు ఆమోదం తెలిపింది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రి వర్గ సమావేశం కీలక నిర్ణయాలు తీసుకుంది. వీటిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపింది. 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి గ్రీన్ సిగ్రల్ ఇచ్చింది. వీరికి రెండేళ్ల పాటు గౌరవ వేతనం ఇచ్చేలా అప్రెంటిస్ విధానానికి ఆమోద ముద్ర తెలిపింది. పాఠశాల విద్యాశాఖలో ఇతర ఖాళీలను పదోన్నతి, బదిలీల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించింది. అన్ని విశ్వవిద్యాలయాల్లోని బోధనేతర సిబ్బంది ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కుటుంబ భద్రతకు ఏర్పాటు చేసే స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్‌లో 25 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీతో పాటు అటవీశాఖలో ఖాళీగా ఉన్న 689 పోస్టులు, ఏపీ పబ్లిక్ సర్వీసులు నియామక, నియంత్రణ చట్ట సవరణకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. డిస్కంలకు రూ.1500 కోట్ల రుణం తీసుకునేందుకు బ్యాంకు హామీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యాయవాదుల సంక్షేమ చట్ట సవరణ, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం పొందిన సౌర పవన విద్యుత్ ప్రాజెక్టులకు పచ్చ జెండా ఊపింది. డిజిటల్ ఇన్‌ఫ్రాకంపెనీని రద్దు చేస్తూ మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెజిస్లేచర్ స్టడీస్ అండ్ ట్రైనింగ్ సంస్థ ఏర్పాటుకు ఓకే చెప్పింది. అసైన్డ్ భూముల మార్పిడి నిషేధ చట్ట సవరణ బిల్లుకు అంగీకారం తెలిపింది. ఎమ్మెల్యేకు ఇళ్ల స్థలాల అంశాలపై చర్చించేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేయకపోవడంతో ఆ అంశం వాయిదా పడింది.

## ఎపికి ఆరు అవార్డులు

**-అభినందించిన సిఎం జగన్**



**టీ మీడియా, జనవరి 31,తాడేపల్లి :** ఒక జిల్లా ఒక ఉత్పత్తి లో ఆరు ప్రతిష్టాత్మక అవార్డులను ఆంధ్రప్రదేశ్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో అధికారులను సీఎం జగన్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్-ఓడీఓపీలో ఒక్క ఏపీకే 6 అవార్డులు రావడం గమనార్హం. ఉప్పాడ జామ్దాని చీరలు, అరకు కాఫీకి బంగారు పతకాలు రాగా.. పొందూరు కాటన్, కోడుమూరు గద్వాల్ చీరలకు కాంస్య పతకాలు లభించాయి. మదనపల్లె పట్టు, మంగళగిరి చేనేత చీరలకు ప్రత్యేక జ్యూరీ అవార్డులు లభించాయి. సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో దేశంలోని ప్రతి జిల్లా నుంచి ఒక ఉత్పత్తిని ఎంపిక చేసి, బ్రాండింగ్, విస్తృత ప్రచారం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం %--% వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అధికారులు అవార్డులు అందుకున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రిని కలిసిన పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఇతర ఉన్నతాధికారులు కలిశారు. వారిని సీఎం జగన్ అభినందించారు.

## లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లో ఐటి సోదాలు



**టీ మీడియా, జనవరి 31,గుంటూరు:** కొత్తపేటలోని లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ లో ఐటి శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.. ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ సిబ్బంది సోదాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. సుమారు 30 మంది సిబ్బందితో నాలుగు బ్రాంచ్ లో సోదాలు జరుపుతున్నారు సిబ్బంది, రోగులను బయటకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు .. కొత్త రోగులకు ప్రవేశం లేకుండా గేటు వద్ద సెక్యూరిటీని నియమించారు.. హాస్పిటల్ లోకి మీడియాని అనుమతించ లేదు.. సోదాలు అనంతరం పూర్తి సమాచారం ఇస్తామని ఐటి అధికారులు వెల్లడించారు.

## సమస్యలన్నీ పరిష్కరిస్తాను సమయం ఇచ్చి ఓపిక పట్టండి

**- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్**



**టీ మీడియా, జనవరి 31, జన్నారం:** మండలంలోని రోటి గూడ గ్రామంలో గల నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఖానాపూర్ శాసనసభ్యులు వెడమ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ 20 లక్షల రూపాయల నిధులతో సర్వాంగ సుందరంగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నిర్మించిన సర్పంచ్లను అభినందించారు. స్థానిక సమస్యలపై నాకు స్పష్టమైన అవగాహన ఉంది అని సమస్యలు పరిష్కరిస్తానని కొంచెం సమయం ఇచ్చి ఓపిక పట్టామని అన్నారు నాయకులు ప్రజాక్షేత్రంలో ఉండే ప్రజల కష్టసుఖాలలో పాల్గొని సమస్యల పరిష్కారం కోసం కష్టపడితే ప్రజలు మరో మరో అవకాశం ఇస్తారు లేదంటే పక్కన పెడుతారు అది నేను అయినా సరే అంటూ అదికారులు ప్రజ క్షేత్రంలో ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీబీలో వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం పొడిగింపు.



**టీ మీడియా, జనవరి 31,నిజామాబాద్ :** జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఏకకాల పరిష్కార పథకం (ఓటీఎస్)ను పొడిగించినట్లు డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. బుధవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడిలోని నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. సొసైటీ చైర్మన్లు, బ్యాంకులో లోన్లు తీసుకున్న రైతుల అభ్య ర్థన మేరకు ప్రవేశపెట్టిన ఏకకాల పరిష్కార పథకం (ఓటీఎస్) పథకాన్ని జనవరి 31వ తేదీతో ముగుస్తున్నందున, ఇంకను చాలా మంది రుణగ్రహీతలు ఏకకాల పరిష్కార పథకం వినియోగించుకుని పాత రుణాల నుండి విముక్తి పొందవలసి ఉన్నందున పాలకవర్గ సమావేశంలో ఏక కాల పరిష్కార పథకాన్ని మార్చి 31తేదీ వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి తెలిపారు. ఏకకాల పరిష్కార పథకం ఫిబ్రవరి 1, నుండి మార్చి 31 వరకు అమలులో ఉంటుందన్నారు. 31నాటికి కాల పరిమితి ముగిసి బ్యాంకు ద్వారా బట్వాడా చేయబడి సొసైటీల ద్వారా తీసుకున్న రుణాలపై అపరాధ వడ్డీ 100శాతం మాఫీ, వాయిదా మీరిన వడ్డీపైన 30శాతం మాఫీ చేయబడుననీ తెలిపారు. ఈనెల 31 నాటికి కాల పరిమితి ముగిసి బ్యాంకు ద్వారా తీసుకున్న (ఎన్ ఎఫ్ ఎస్), మార్ట్ గేజ్, ఎల్ టి, తదితర రుణాలపై వడ్డీ 32శాతం మాఫీ చేయబడునన్నారు. అర్హులైన రుణ గ్రహీతలు అందరూ ఏకకాల పరిష్కార పథకాన్ని సద్వినియోగం చేసుకొని బ్యాంకు అభివృద్ధికి సహకరించగలరనీ కోరారు. ఖచ్చితమైన వివరాల కోసం సంబంధిత సొసైటీలను, బ్రాంచ్ మేనేజర్ లను సంప్రదించాలని తెలిపారు.

## 5నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు




**టీ మీడియా, జనవరి 31,అమరావతి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 7 వరకు సమావేశాలు నిర్వహించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. 5న గవర్నర్ ప్రసంగంతో పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. 6, 7 తేదీల్లో బడ్జెట్‌పై చర్చతో పాటు వివిధ సవరణ బిల్లులను సభ ముందు ఉంచే అవకాశముంది.